క్లుప్తంగా

28న టెలికాం వినియోగదారులకు అవగాహన

గిద్దలూరు రూరల్: స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయ కమిటీ హాల్లో ఈ నెల 28న టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు బి.శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మిర్చి రైతులు జాగ్రత్తలు పాటించాలి

బేస్తవారిపేట: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిర్చి పంట దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి డి.శ్వేత పేర్కొన్నారు. మండలంలోని చెట్టిచర్ల, పెంచికలపాడు గ్రామాల్లో మిరప తోటలను గురువారం ఆమె పరిశీలించారు. వర్షాల కారణంగా మిరపను బ్యాక్టీరియా ఆకుమచ్చ, కానోఫారా వంటి తెగులు ఆశించే అవకాశం ఉందని, ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ గణేష్, ఉద్యానవన సహాయకులు నాగజ్యోతి ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


మృతి చెందిన గేదెలు

పొదిలి రూరల్: విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని రాజుపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాజుపాలెం గ్రామానికి చెందిన కంచర్ల పెద్ద నాగేశ్వరరావు, కీర్తి ప్రసాద్‌కు చెందిన రెండు గేదెలను మేత కోసం పొలానికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తుళ్లూరి రమణయ్య పొలంలో వర్షానికి తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.80 వేలకు పైగా ఉంటుందని యజమానులు తెలిపారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి


రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కంభం: వంగవీటి రంగా 36వ వర్ధంతిని గురువారం కంభం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కందులాపురం కూడలిలో బలిజ సేవా సంఘం కార్యాలయంలో వంగవీటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంభం ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉదయగిరి మల్లికార్జున, శ్రీను పాల్గొన్నారు.

థెరీసమ్మకు ఘన నివాళి


థెరీసమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన మాతృమూర్తి థెరీసమ్మ రెండో వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక జార్జి కళాశాలలో ఘాట్ వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. థెరీసమ్మ ఆశయాలు కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

కంభం: రెవెన్యూ గ్రామసభల్లో రైతులు అందజేసిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. గురువారం జంగంగుంట్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభను జేసీ పరిశీలించి, అధికారులకు పలు సూచనలిచ్చారు. రైతుల సమస్యలు పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. గ్రామసభలో 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఎల్‌కోట సమీపంలో తడిసిన మినుము ఓదెలు


గొట్లగట్టు సమీపంలో కోతదశలో నేలవాలిన అలసంద


కంభంలో శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ స్వరూప

- రైతులను వెంటాడుతున్న వరుస అల్పపీడనాలు
- రెండు రోజులుగా ఎడతెరపిలేని వానతో అన్నదాతల్లో ఆందోళన
- కల్లాల్లో తడిసి బూజుపడుతున్న మిర్చి
- పలు గ్రామాల్లో నీట మునిగిన వరి కయ్యలు
- మిర్చి, కంది, శనగ పంటలకు తెగుళ్ల ముప్పు

ఈ వాన ఎన్నాళ్లు.. మిగిలేది కన్నీళ్లు!

మార్కాపురం:

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులను ఆందోళనలో పడేశాయి. కోత కోసి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. మిర్చి తడవడం వల్ల కాయ రంగు మారి బూజు పడుతుండటంతో ధర తగ్గిపోతుందని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. పశ్చిమ ప్రకాశంలోని 12 మండలాలతోపాటు మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, మండలాల్లో మొత్తం 45,813.59 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. పత్తి 41,250 ఎకరాల్లో సాగు చేయగా రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు తెగుళ్లు చుట్టుముట్టాయి. ఆ తర్వాత అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పత్తి దిగుబడి పడిపోయింది. మార్కాపురం సబ్ డివిజన్‌లో 3,460 హెక్టార్లలో సాగు చేసిన శనగ పంట వరుసగా కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా దెబ్బతింది. వర్షానికి కంది పూత రాలిపోతుండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఈ నెల తొలి వారంలో నీట మునిగిన పప్పు శనగలో తేమ ఆరిన తర్వాత ఎండు తెగులు సోకింది.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

మిరపలో తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి రమేష్, వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మబ్బులతో కూడిన వాతావరణంలో కోతలు చేపట్టవద్దని తెలిపారు. మిరపకాయలను 11 శాతం తేమ వచ్చే వరకు ఎండబెట్టాలని చెప్పారు. వర్షం వల్ల కుచ్చుముడత తెగులు వచ్చే ప్రమాదం ఉందని, నివారణకు స్పైనోసాడ్ 2 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మెగ్నీషియం లోపం ఉంటే ఎకరాకు ఒక కిలో, బోరాన్ లోపం ఉంటే అర కిలో స్ప్రే చేయాలని సూచించారు. వర్షాల వల్ల కాయమచ్చ తెగులు సోకే అవకాశం ఉందని, నివారణకు క్లోరోథలోనిల్ 250 గ్రాములను ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు.


పొదిలి : అన్నవరంలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


కంభం మండలం లింగోజిపల్లి వద్ద బూజుపడుతున్న మిర్చిని చూపిస్తున్న మహిళా రైతు

700 ఎకరాల్లో దెబ్బతిన్న శనగ

కంభం: వర్షాల కారణంగా కంభం మండలంలో సుమారు 700 ఎకరాల్లో శనగ పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి స్వరూప తెలిపారు. కంది, మొక్కజొన్న, వరి పైర్లను పరిశీలించి నష్టం అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వర్షం ఆగితే పూర్తిస్థాయిలో ఎంత మేర పంట నష్టం వాటిల్లిందో తెలుస్తుందన్నారు.

నీట మునిగిన వరి కయ్యలు

పొదిలి రూరల్: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పొదిలి మండలంలో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కంది పంటలో పూత రాలిపోతోంది. అన్నవరం గ్రామంలో 100 ఎకరాలు, ఆముదాలపల్లిలో 10 ఎకరాలు, పొదిలిలో 10 ఎకరాల వరికి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పంట కోత దశలో ఉన్న సమయంలో నష్టం సంభవించడంతో రైతులు మౌనంగా రోదిస్తున్నారు. అన్నవరం, ఆముదాలపల్లి, పొదిలిలో దెబ్బతిన్న వరి చేలను గురువారం ఏఓ ఎస్‌కె జైన్‌లాబ్దిన్ పరిశీలించారు.

చేతికొచ్చిన పంట.. నీటిపాలై..

కొనకనమిట్ల: మండలంలో అలసంద, మినుము, జొన్న, పత్తి, కంది, మిర్చి పంటలు సాగులో ఉన్నాయి. అంతా బాగుంది.. నాలుగు రూపాయలు మిగులుతాయని భావించిన రైతన్నల ఆశల మీద అల్పపీడనం నీళ్లు చల్లింది. మూడు రోజులుగా ముసురు పట్టి, గురువారం జోరు వాన కురవడంతో కోత దశలో ఉన్న అలసంద, మినుము దెబ్బతిన్నాయి. పాతపాడులో కోత కోసిన అలసంద తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


తిప్పాయపాలెంలో మిర్చిపై పట్టాలు కప్పిన రైతులు


మినుము వామి తడవకుండా పరదా కప్పిన రైతులు


మార్కాపురం : మిర్చి రైతులకు సూచనలిస్తున్న ఏవో శ్రీనివాసులు


లింగోజిపల్లి వద్ద కల్లంలో మిర్చిని కాపాడుకునేందుకు రైతుల యత్నం

తీవ్ర నష్టం వాటిల్లింది



రెండు ఎకరాల్లో శనగ, నాలుగు ఎకరాల్లో మిర్చి వేశా. ప్రస్తుతం శనగ పంట పూత దశలో ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వానకు పూత రాలిపోయి పంట దెబ్బతింది. ఈ సీజన్‌లో పంట దిగుబడి తగ్గి తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

– కె.రంగయ్య, రైతు, నడింపల్లి, కంభం మండలం

పెట్టుబడి చేతికొచ్చేలా లేదు



పది ఎకరాల్లో వేసిన శనగ ప్రస్తుతం పూత దశలో ఉంది. పంట కాయ దశకు వచ్చే సమయంలో తుఫాను తగులుకుంది. రెండు ఎకరాల్లో మిర్చి వేసి లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టా. పంట కోతకు వచ్చిందిలే అనుకునే సమయంలో వర్షం పడుతోంది. కోసిన ఎండు మిర్చి కూడా తడిసిపోయింది.

– కర్నం బాలుడు, లింగోజిపల్లి, కంభం మండలం

రైతులకు కోలుకోలేని దెబ్బ..



తుఫాన్ ప్రభావంతో వారం రోజులు పాటు ముసురుతో కూడిన వర్షాలు రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి. రబీలో మినుము, అలసంద పంటతోపాటు మిర్చి, పొగాకు సాగు చేశా. ఈ వర్షం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. నేను 50 ఎకరాల్లో బొబ్బర్లు(అలసంద), 10 ఎకరాల్లో మినుము, 10 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. రూ.4 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– పొదిలి తిరుపతయ్య, గొట్లగట్టు

ఒప్పందం మేరకు వేతనం పెంచాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



పొదిలిలో నినాదాలు చేస్తున్న కార్మికులు

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్

మార్కాపురం టౌన్: గతంలో సమ్మె చేసినపుడు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనం పెంచుతామన్న ఒప్పందాన్ని అమలు చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట జడివానలోనే ఇంజినీరింగ్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో జీఓ నంబర్ 36 ప్రకారం వేతనం పెంచాలని 16 రోజుల సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై కార్మికులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌ను వేతనం పెంపు విషయమై కార్మికులు పలుమార్లు కలిశారని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవటంతో ధర్నా చేస్తున్నామని చెప్పారు. పనికి తగిన వేతనం లేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు హరి, హిమామ్‌సా, రమణ, సలాంఖాన్ పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

పొదిలి: మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఒప్పందాలు నేటికీ అమలుకు నోచుకోలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ పేర్కొన్నారు. ఒప్పందాల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. సమ్మె ఒప్పందాలు అమలు చేయకపోవడం పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తోందన్నారు. పదేళ్లు పూర్తయిన కార్మికులు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేక నష్టపోతున్నారన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21 వేల వేతనం ఇవ్వాల్సి ఉండగా, రూ.15 వేలతో సరిపెట్టడం సమంజసం కాదన్నారు. నగర పంచాయతీగా మారినప్పటి నుంచి ఇప్పటి వరకు హెల్త్ అలవెన్స్ ఇవ్వక పోవడంతో ఒక్కో కార్మికుడు రూ.2.16 లక్షలు నష్టపోయారన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోకపోతే పోరాటాన్ని తీవ్రం చేస్తామన్నారు. ధర్నాలో కార్మిక సంఘ నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నరసింహం, పి.నాగేంద్రం, ఎ.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

గిద్దలూరు రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా గిద్దలూరు ప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్‌లో సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులను బోధనకు అంకితం చేయాలని, యాప్‌ల పేరుతో అమూల్యమైన సమయాన్ని వృథా చేయడం దారుణమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్టీయూ తరఫున ప్రయత్నిస్తామన్నారు. పలువురు ఉపాధ్యాయులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాగా, ఎస్టీయూ అడహక్ కమిటీ గిద్దలూరు మండల అధ్యక్షుడిగా శిరిగిరి రంగస్వామి, జిల్లా కౌన్సిలర్‌గా ఎం.బాలగురవయ్య, రాచర్ల మండల అధ్యక్షుడిగా ఎం.రమేష్ బాబు, కొమరోలు మండల అధ్యక్షుడిగా గోళ్ల శ్రీనును ఎన్నుకున్నారు.


నూతన కార్యవర్గ సభ్యులతో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఎల్లమ్మతల్లి ఆలయానికి 'కాసు' ట్రస్టు రూ.లక్ష విరాళం

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీ వెంగళపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కాసు చారిటబుల్ ట్రస్టు తరఫున రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. గురువారం బచ్చలకూరపాడు పంచాయతీ కాసు ఎస్టేట్‌లో వెంగళపల్లి గ్రామస్తులు కాసు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కాసు వెంకటేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా 'కాసు' సానుకూలంగా స్పందించి విరాళం అందజేశారు. 'కాసు'ను గ్రామ పెద్దలు అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ.. తమ ట్రస్టు తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాట్రగుంట పంచాయతీ ట్రస్టు సభ్యులు రాజాల రామిరెడ్డి, వెంగళపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.


లక్ష రూపాయల విరాళాన్ని అందిస్తున్న కాసు

విద్యుత్ చార్జీల బాదుడుపై నేడు వైఎస్సార్ సీపీ పోరు

మార్కాపురం: తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు ఆరు నెలల్లో సుమారు 15 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపారని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. ఈ నేపథ్యంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మార్కాపురం విద్యుత్ కార్యాలయం ఎదుట పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు

గిద్దలూరులో ధర్నాకు తరలిరండి

కంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై మోయలేని భారం వేసిందని, అందుకు నిరసనగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన గిద్దలూరులో నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు కంభం ఏఎంసీ మాజీ ఛైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


జగనన్న కాలనీని పరిశీలించిన కలెక్టర్


కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్

మార్కాపురం టౌన్: జగనన్న కాలనీలో నిలిచిపోయిన గృహాలను త్వరితగతిన నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ఇడుపూరులోని జగనన్న కాలనీలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి గృహాలను త్వరగా నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆమె వెంట ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, హౌసింగ్ డీఈ పవన్‌కుమార్, ఏఈ చందు, కమిషనర్ నారాయణరావు, తహసీల్దార్ చిరంజీవి పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

మార్కాపురం రూరల్: మండలంలో గోగులదిన్నెలో నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రైన్‌లు నిర్మించారో లేదో పరిశీలించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పునరావాస కాలనీలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంట వెలిగొండ ప్రాజెక్టు జేఈ అనుదీప్, సిబ్బంది ఉన్నారు.


కాలనీని పరిశీలిస్తున్న జేసి గోపాలకృష్ణ

భూ సమస్యలు పరిష్కరించాలని మొర

మార్కాపురం రూరల్: రెవెన్యూ సదస్సుకు వచ్చే అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండలంలోని బోడపాడు గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో ఎక్కువ శాతం అర్జీలు మ్యుటేషన్ కోసం వచ్చాయన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.